

మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన కుమారుడు బుధవారం టీడీపీలో చేరారు. అధినేత చంద్రబాబునాయుడు పార్టీ కేంద్ర కార్యాలయంలో పసుపు కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు.

-వార్త మెయిన్



అనకాపల్లి నుంచి అమర్ అవుట్!

సమన్వయకర్తగా భరత్‌ను నియమించిన వైసీపీ అధిష్ఠానం

- మంత్రికి మరో నియోజకవర్గం బాధ్యతలు అప్పగించని పార్టీ పెద్దలు
- సామాజిక సమీకరణల్లో భాగంగా పార్లమెంటుకు పోటీ చేయించే యోచన?
- అసెంబ్లీకే మొగ్గు చూపుతున్న అమర్
- ఎలమంచిలి, చోడవరం, పెందుర్తిల్లో ఏదో ఒకచోట నుంచి పోటీ ఖాయమంటున్న అనుచరులు



గుడివాడ అమర్‌నాథ్



మలసాల భరత్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు వైసీపీ అధిష్ఠానం ఊహించని షాకిచ్చింది. అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల సమన్వయకర్తల తొలగింపు, కొత్తవారి నియామకంపై పార్టీ పెద్దలు గత కొద్ది రోజుల నుంచి కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. మొదటి జాబితాను గతంలోనే విడుదల చేయగా, రెండో జాబితాను మంగళవారం విడుదల చేశారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా కశింకోట మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ కుమారుడైన భరత్‌కుమార్ నియమించారు. రాజకీయ వర్గాల్లో.. ముఖ్యంగా వైసీపీలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది.

రాష్ట్రంలోని పలు జిల్లాలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను తమ సొంత నియోజకవర్గాలకు కాకుండా వేరే నియోజకవర్గాలకు సమన్వయకర్తలుగా పార్టీ అధిష్ఠానం నియమించింది. వచ్చే ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల నుంచి వీరే పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తారనే ప్రచారం సాగుతున్నది. ఇదిలావుండగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లికి వేరే వ్యక్తిని సమన్వయకర్తగా నియమించిన పార్టీ పెద్దలు, అమర్‌కు మాత్రం మరేఇతర నియోజకవర్గం అప్పగించకుండా గాల్లో వుంచారు. దీంతో వచ్చే ఎన్నికల్లో అమర్‌నాథ్‌కు వైసీపీ టికెట్ ఇస్తుందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మంత్రి అమర్.. సీఎం జగన్‌కు అత్యంత ఆప్తుడుగా గుర్తింపు పొందారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లికి పార్టీ సమన్వయకర్తగా భరత్‌కుమార్‌ను నియమించారు. ఇదే సమయంలో అమర్‌ను మరో నియోజకవర్గానికి సమన్వయకర్తగా నియమించకపోడంతో ఆయన అనుచరగణంలో అంతర్మథనం మొదలైంది. గతంలో అనేక సందర్భాల్లో మంత్రి అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ.. తాను వచ్చే ఎన్నికల్లో మళ్లీ అనకాపల్లి నుంచే పోటీ చేస్తానని ప్రకటించారు. అంతేకాక అనకాపల్లిలోనే ఇల్లు కట్టుకుంటున్నానని, ఇంకెక్కడికి వెళతానని అన్నారు. కానీ వైసీపీ అధిష్ఠానం అనూహ్యంగా తీసుకున్న నిర్ణయంతో పరిస్థితులు మారిపోయాయి. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని పైకి చెబుతున్నప్పటికీ రానున్న ఎన్నికల్లో టికెట్ దక్కుతుందా, లేదా అనేదానిపై ఆలోచనలో పడినట్టు తెలిసింది. అయితే ఆయన అనుచరులు మాత్రం అమర్ త్వరలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏదో ఒక నియోజకర్గానికి సమన్వయకర్తగా ... మిగతా 8వ పేజీలో

కదం తొక్కిన అంగన్‌వాడీలు

సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీ



- అన్నివైపులా రహదారులు దిగ్బంధం
- నాలుగున్నర గంటలపాటు ధర్నా
- ఇచ్చిన హామీలను సీఎం జగన్మోహన్‌రెడ్డి నెరవేర్చలేదని ఆగ్రహం
- వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపుతామని హెచ్చరిక



నెహ్రూచౌక్‌ను దిగ్బంధించిన అంగన్‌వాడీలు



సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్‌కు భారీ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి టౌన్, జనవరి 3:

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 23 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు బుధవారం కదం తొక్కారు. వివేకానందనగర్‌లోని సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ నాలుగు వైపులా బైఠాయించి రహదారులను దిగ్బంధం చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు ఆందోళన కొనసాగించారు. జగన్ ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి, సమస్యలు పరిష్కరించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ, గత ఎన్నికల ముందు పాదయాత్ర చేసిన సమయంలో జగన్మోహన్‌రెడ్డి పలు హామీలు ఇచ్చారని, వైసీపీ అధికారంలోకి వచ్చి 55 నెలలు అయినప్పటికీ ఒక్కటి కూడా నెరవేర్చలేదని అన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అంటూ తరచూ గొప్పలు చెప్పుకునే సీఎం జగన్మోహన్‌రెడ్డి.. తాను ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కడం దుర్మార్గమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా ... మిగతా 8వ పేజీలో

రోడ్డు విస్తరణ ఎప్పుడో!

ఇరుకుగా మారిన నూకాంబిక ఆలయం రహదారి

- 2.3 కి.మీ.లు విస్తరించాలని జీవీఎంసీ అధికారులు గత ఏడాది ఆగస్టులో నిర్ణయం
- నెల రోజుల్లో పనులు మొదలుపెడతామని వెల్లడి
- ఐదు నెలలు దాటినా అతీగతీలేని వైనం



విస్తరణకు నోచుకోని నూకాంబిక ఆలయానికి వెళ్లే రోడ్డు

అనకాపల్లి టౌన్, జనవరి 3:

'మాటలు కోటలు దాటుతుంటే.. చేతలు గడప దాటడం లేదు' అన్న తీరుగా వుంది జీవీఎంసీ అధికారుల వ్యవహారశైలి. నూకాంబిక అమ్మవారి ఆలయ రోడ్డును విస్తరించనున్నట్టు ఐదు నెలల క్రితం ప్రకటించారు. ఈ ఏడాది అమ్మవారి కొత్త అమావాస్య జాతరనాటికి అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

జాతీయ రహదారిలో తోటాడ జంక్షన్ వద్ద నూకాంబిక అమ్మవారి ఆలయ ముఖద్వారం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే మార్గం ప్రస్తుతం 20-30 అడుగులు మాత్రమే వుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సుమారు 2.3 కిలోమీటర్ల పొడవు వున్న ఈ రహదారిని 60 అడుగులకు విస్తరించాలని జీవీఎంసీ అధికారులు ఈ ఏడాది ఆగస్టులో నిర్ణయించారు. వినాయక చవితి (సెప్టెంబరు 19) ముగిసిన వెంటనే పనులు మొదలుపెడతామని చెప్పారు. ఈ మేరకు రోడ్డుకు ఇరువైపులా కొలతలు తీసి, మార్కింగ్‌లు కూడా చేశారు. రోడ్డు విస్తరణలో 210 మందికి చెందిన ఆస్తులు పోతాయని టౌన్‌ప్లానింగ్ అధికారులు చెప్పారు. నష్టపరిహారం చెల్లింపు కోసం ఆస్తుల ధ్రువపత్రాలను ఆయా యజమానుల నుంచి స్వీకరించడం మొదలుపెట్టారు. కానీ రోడ్డు పనులు మాత్రం మొదలుకాలేదు.


కాగా పట్టణంలోని పెరుగుబజార్ రోడ్డును 50 అడుగులకే విస్తరిస్తున్నందున నూకాంబిక ఆలయం రోడ్డును కూడా 50 అడుగులే విస్తరించాలని ఈ ప్రాంతవాసులు పట్టుబడుతున్నట్టు తెలిసింది. ఈ కారణంగానే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించలేదని అధికారులు చెబుతున్నారు. రోడ్డును విస్తరించాలన్న ఉద్దేశంతో నిర్వహణ పనులు చేపట్టలేదు. దీంతో పలుచోట్ల గోతులు ఏర్పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కాగా రోడ్డు విస్తరణ పనులు జరగకపోవడంపై జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారి జనార్దనరావును వివరణ కోరగా.. జలగలమదుం జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేపడుతున్నందున నూకాంబిక ఆలయ మార్గం పనులు కొంత జాప్యం అవుతాయన్నారు.



అరకు కాఫీకి అరుదైన గుర్తింపు

'వన్ డిస్ట్రిక్ట్... వన్ ప్రాడక్ట్' పేరిట కేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో బంగారు పతకం కైవసం - 8లో

దేశంలో వివిధ జిల్లాల్లో ప్రాచుర్యం పొందిన ఉత్పత్తులకు 'వన్ డిస్ట్రిక్ట్...వన్ ప్రొడక్ట్' పేరిట ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని భావించిన కేంద్ర ప్రభుత్వం బుధవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అరకు కాఫీని బంగారు పతకానికి ఎంపిక చేసింది.



విమానాశ్రయంలో భువనేశ్వరితో టీడీపీ నేతలు

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం

విశాఖపట్నం, జనవరి 3:

మూడు రోజుల ఉత్తరాంధ్ర పర్యటన కోసం బుధవారం నగరానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. చంద్రబాబునాయుడు అరెస్టు సమయంలో మనస్తాపంతో ప్రాణాలు విడిచిన వారి కుటుంబాలను ఆమె పరామర్శించి సాయం అందజేస్తున్నారు. ఆమె బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖపట్నం చేరుకున్నారు. ఆమెకు మాజీ స్పీకర్ ... మిగతా 8వ పేజీలో

టిడ్కో గృహాలతో ఓట్లకు ఎర

ఎన్నికలు సమీపిస్తుండడంతో లబ్ధిదారులకు పంపిణీ

- టీడీపీ హయాంలో టిడ్కో గృహసముదాయాల నిర్మాణం
- మౌలిక సదుపాయాలు కల్పించే సమయానికి మారిన ప్రభుత్వం
- నాలుగేళ్లపాటు గాలికొదిలేసిన వైసీపీ పాలకులు
- ఎన్నికల వేళ లబ్ధిదారులకు అప్పగించడానికి ఏర్పాట్లు
- పార్టీ జెండా రంగులు వేసి ముస్తాబు
- నేడు సత్యనారాయణపురంలో మంత్రుల చేతుల మీదుగా పంపిణీ



టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో గృహసముదాయం. (ఇన్‌సెట్‌లో) వైసీపీ రంగులు వేసిన టిడ్కో ఇళ్లు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

సొమ్మొకరిది.. సోకు మరొకరిది అన్న చందంగా వుంది వైసీపీ పాలకుల తీరు. తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు నిర్మించిన టిడ్కో ఇళ్లను ఎట్టకేలకు లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు వైసీపీ రంగులు వేసి ముస్తాబు చేశారు. నాలుగున్నరేళ్ల నుంచి టిడ్కో ఇళ్లను తమకు అందజేయకుండా పాడుబెట్టిన వైసీపీ ప్రభుత్వం, ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో ఓట్ల కోసం ఇళ్లను తామే నిర్మించి, పంపిణీ చేస్తున్నట్టు 'కలరింగ్' ఇస్తున్నదని లబ్ధిదారులు ఎద్దేవా చేస్తున్నారు.

అనకాపల్లి పట్టణంతోపాటు కొప్పాక, రాజుపాలెం, వల్లూరు ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు సొంత గూడు కల్పించాలన్న ఉద్దేశంతో గత తెలుగుదేశం ప్రభుత్వం ఏపీ టిడ్కో ఆధ్వర్యంలో గృహనిర్మాణాలు చేపట్టింది. రూ.120 కోట్ల అంచనా వ్యయంతో సత్యనారాయణపురంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఒక్కో బ్లాకులో 32 ఫ్లాట్ల చొప్పున మొత్తం 86 బ్లాకుల్లో 2,752 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 2019లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడానికి సుమారు నెల రోజుల ముందు 2,744 ఫ్లాట్ల నిర్మాణం పూర్తికావడంతో డ్రా పద్ధతిలో లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. అయితే తాగునీరు, రహదారుల, డ్రైనేజీల నిర్మాణ పనులు మొదలుపెట్టే సమయానికి సాధారణ ఎన్నికలు జరిగి, వైసీపీ అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్లకు గ్రహణం పట్టింది. సుమారు రెండున్నరేళ్ల వరకు ఇళ్ల గురించి పట్టించుకోలేదు.

ఇదిలావుండగా టిడ్కో కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఫ్లాట్లను తమకు ... మిగతా 8వ పేజీలో

హాస్టల్ విద్యార్థుల మందు పార్టీపై బాలల హక్కుల కమిషన్ సీరియస్

విచారణకు ఆదేశించిన సభ్యుడు సీతారాం

- వసతిగృహాన్ని సందర్శించిన ఎంఈవో
- వార్డెన్, విద్యార్థుల నుంచి వివరాలు సేకరణ



బీసీ బాలుర వసతిగృహం

చోడవరం, జనవరి 3: పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహం విద్యార్థుల మందుపార్టీ వ్యవహారాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేసి నివేదిక అందించాలని కమిషన్ సభ్యుడు సీతారాం బుధవారం అధికారులను ఆదేశించారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని వసతిగృహంలో వుంటూ, 8వ తరగతి నుంచి ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

420 కిలోల గంజాయితో ఆరుగురి అరెస్టు

పెదబయలు, జనవరి 3: ఒడిశా నుంచి ఏజెన్సీ మీదుగా మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 420 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు బుధవారం రూడకోట కూడలిలో వాహనాల తనఖీ చేపట్టారు. ఒడిశా వైపు నుంచి వస్తున్న బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 420 కిలోల గంజాయి లభించింది. వాహనంలో వున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరు ఒడిశా రాష్ట్రం సిమిలిగుడకు చెందిన గబులు, నీలం, మరో మైనర్; ముంచంగిపుట్టు మండలం కుమడ పంచాయతీ చీపురుగొంది గ్రామానికి చెందిన భాస్కరరావు, బోసుబాబు, రామారావుగా గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కోడి పందాల శిబిరంపై దాడి, నలుగురి అరెస్టు

బుచ్చెయ్యపేట, జనవరి 3: వడ్డాది శివారులో కోడి పందాల శిబిరంపై బుధవారం పోలీసులు దాడిఇ చేశారు. నలుగురిని అరెస్టు చేసి, ఒక కోడిపుంజు, రూ.4,180 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ డి.ఈశ్వరరావు మాట్లాడుతూ, సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు, పేకాట, గుళ్లాట వంటి జూదాలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి విశాఖలో కథా నాటిక పోటీలు

విశాఖపట్నం, జనవరి 3: తెలుగు సాహిత్యం, సంస్కృతిని ప్రతిబింబించేలా అజో- విభో-కందాళం ఫౌండేషన్, రైటర్స్ అకాడమీల ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు కథానాటిక పోటీలను నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పాజోశ్యుల సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణమూర్తి తెలిపారు. విశాఖ పౌరగ్రంథాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అజో-విభో 31వ వార్షికోత్సవం సందర్భంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలో పాల్గొనేందుకు మొత్తం 29 నాటికలు వచ్చాయని వాటిలో తొమ్మిదింటిని ఎంపిక చేసి, ప్రతిరోజూ మూడు ప్రదర్శనల చొప్పున ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈనెల 7వ తేదీన 'సరిలేరు నీకెవ్వరు' పురస్కారాన్ని మల్లిపురం జగదీష్, విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని రేవూరి అనంతపద్మరావుకు, ప్రతిభామూర్తి పురస్కారాన్ని ఎల్లపు ముకుంద రామారావులకు అందజేస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి: కలెక్టర్

అనకాపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలింగ్ కేంద్రాల పరిస్థితిని తనిఖీ చేసి, మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో ఇప్పటి వరకు అందిన మార్పులు, చేర్పులు, తొలగింపులు దాదాపు పూర్తికావచ్చాయని చెప్పారు. ఇక నుంచి జిల్లాలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను తనిఖీ చేయనున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, నీరు, వికలాంగులకు ర్యాంపు మొదలైన వసతులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అవసరమైన చోట్ల అదనపు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం గురించి కూడా పరిశీలన చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌వో బి.దయానిధి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు లక్ష్మిదేవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.శ్రీనివాసరావు(టీడీపీ), ఎస్‌వీవీ.రామచంద్రరావు(బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలపై జీసీసీ చైర్‌పర్సన్‌కు వినతి

విశాఖపట్నం, జనవరి 3 : జీసీసీ హమాలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజన కలాసీల వెల్ఫేర్ సొసైటీ (ఏఐటీయూసీ అనుబంధం) సభ్యులు రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ కార్యాలయంలో చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీసీసీని నమ్ముకుని హమాలీలు ఏళ్ల తరబడి పనిచేస్తున్నా.. కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పదవీ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ ఇవ్వాలని, చనిపోయిన వారి కుటుంబానికి దహన ఖర్చులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, హమాలీల సంఘం నాయకులు పండు బాబు, లగుడు సీతయ్యనాయుడు, సుబ్బారావు, స్వామి, ఎం.రాజబాబు, పి.పరశురాం, చందు, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా సికింద్రాబాద్, బ్రహ్మపూర్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, జనవరి 3: సంక్రాంతి రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా సికింద్రాబాద్, బ్రహ్మపూర్ మధ్య ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 07093 నంబరు గల రైలు ఈనెల 8, 15 తేదీల్లో రాత్రి 7.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ, 11.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07094 నంబరు గల రైలు ఈనెల 9, 16న మధ్యాహ్నం 12.30 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 6.00 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ సర్వీసులు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అ న్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, బ్రహ్మపూర్ మధ్య రాకపోకలు సాగిస్తాయి.

ఉదయ్ ఎక్స్‌ప్రెస్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లు పునరుద్ధరణ

విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న భద్రతా నిర్మాణ పనుల నేపథ్యంలో రద్దు చేసిన ఉదయ్ ఎక్స్‌ప్రెస్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించినట్టు త్రిపాఠి తెలిపారు. దీంతో విజయవాడ, విశాఖ మధ్య రాకపోకలు సాగించే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను (22702/22701) ఈనెల 5వతేదీనుంచి 13వ తేదీ వరకు, అలాగే గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239) రైలు ఈనెల పది నుంచి 14వ తేదీ వరకు, విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240) రైలు ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

డీసీసీబీ సీఈవో నియామకంలో అక్రమాలు

» సహకార రిజిస్ట్రార్‌కు విశ్రాంత ఉద్యోగుల ఫిర్యాదు

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవోగా డీవీఎస్ వర్మను మూడోసారి నియమించడంలో అక్రమాలు జరిగాయని కొందరు బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు సహకారశాఖ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదుచేశారు. ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా సీఈవో పోస్టులో వర్మను కూర్చోబెట్టారని ఫిర్యాదులో ఆరోపించారు. ప్రభుత్వం నామినేట్ చేసిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చేపట్టిన సీఈవో నియామకం చెల్లదని, కమిటీకి ఆ అధికారం లేదని ఫిర్యాదులో వివరించారు. గత ఏడాది జూలై 13న సీఈవోను నియమించేందుకు అప్పటి పర్సన్ ఇన్‌చార్జి చింతకాయల అనిత అధ్యక్షతన బోర్డు తీర్మానించడం నుంచి సెప్టెంబరు 17న సీఈవోగా వర్మ మూడోసారి బాధ్యతలు స్వీకరించే వరకు గోప్యత పాటించడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. బ్యాంకు ఖాతాదారులు, అనుబంధ సంస్థలకు తెలిసేలా సీఈవో నియామక ప్రకటన చేయాల్సి ఉండగా, దొడ్డిదారిన చేపట్టారన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులది కీలక పాత్ర

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి టౌన్, జనవరి 3: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారుల పాత్ర కీలకమైనదని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. బుధవారం స్థానిక ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో సెక్టార్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడారు. వీరికి మెజిస్ట్రీరియల్ అధికారాలు ఉంటాయన్నారు. ఎన్నికల జిల్లా అధికారి, జిల్లా ఎస్పీలకు ప్రతినిధులుగా సెక్టార్ అధికారి, సెక్టార్ పోలీస్ అధికారి వ్యవహరిస్తారని పేర్కొన్నారు. వల్నరబుల్ (దుర్బల) పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించవలసి ఉంటుందన్నారు. అంతకుముందు జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం ఎక్కువగా ఉండి వాటిలో ఎక్కువశాతం ఒకే అభ్యర్థికి ఓట్లు వచ్చినట్లయితే, ఓటర్లను బెదిరించడం, ఓట్లు వేయడానికి లేకపోతే వేయకుండా భయం కల్పించడం, పోలింగ్‌లో పాల్గొనడానికి ఓటర్లే అనాసక్తతతో ఉండడం వంటి పోలింగ్ కేంద్రాల ప్రాంతాలను గుర్తించాల్సి ఉంటుందన్నారు. అటువంటి పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో ఓటర్లను చైతన్యపరచడం, వారి ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు అవసరమైన వాతావరణం కల్పించాలన్నారు. ఎన్నికల్లో పాల్గొనే అధికారులు పీవోలు, ఏపీవోలతో సమన్వయం చేసుకుంటూ ఉండాలన్నారు. ఓటర్లను చైతన్యపరిచేందుకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు 16 మంది వివిధ నోడల్ అధికారులు ఉంటారని తెలిపారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రశాంత, నిష్పక్షపాత ఓటింగ్ సరళి చేపట్టే విధంగా సెక్టార్ అధికారులు ప్రణాళికతో ముందస్తు పరిస్థితిని కల్పించాలన్నారు. ఆ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు, సంఘ వ్యతిరేక కార్యక్రమాలు మొదలైన వాటిని గుర్తించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను అనుసరిస్తూ ప్రశాంత వాతావరణం కల్పించాలని సూచించారు. ముందుగా వివిధ ఎన్నికల నిర్వహణ అధికారుల సమన్వయంతో నిష్పక్షపాత, ప్రశాంతమైన పోలింగ్ నిర్వహణకు సిద్ధం చేయాలన్నారు. తరువాత సెక్టార్ అధికారుల విధులు, నియమ నిబంధనలను గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో బి.దయానిధి, నర్సీపట్నం అడిషినల్ ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా, జిల్లాలోని ఆర్డీవోలు, ఎస్‌డీసీలు, ఏఈఆర్‌వోలు అయిన తహసీల్దార్లు, పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ధర్నా


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న చినబ్బాయి

అనకాపల్లి టౌన్, జనవరి 3: ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నెహ్రూచౌక్ బస్టాప్ వద్ద యూటీఎఫ్ బుధవారం 12 గంటల ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయి ఉన్న రూ.18 వేల 96 కోట్లను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడుగా ఉండగా రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తానని, మంచి పీఆర్‌సీ ఇస్తానని, టైమ్ టూ టైమ్ డీఏ ఇస్తానని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేస్తానని వరాలు కురిపించి ఈ నాలుగున్నరేళ్లలో హామీలను నెరవేర్చకపోవడం విచారకరమన్నారు. ప్రస్తుతం పదో తేదీ దాటితేనే గాని జీతాలు రాని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం దిగి రాకపోతే విజయవాడలో ఈ నెల తొమ్మిది, పది తేదీల్లో 36 గంటల పాటు ధర్నా నిర్వహించనున్నట్టు చినబ్బాయి చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఏకేవీ రామబ్రహ్మం, కట్టా శ్రీను, గాయిత్రి, జోగా రాజేశ్, జీఎస్ ప్రకాశ్, మామిడి అరుణ, డీఆర్‌కే శాస్త్రి, జీకేఆర్ స్వామి, ఎం.నానాజీ, కామరాజు, గిరి, సుభాషిణి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె



శిబిరంలో నినాదాలిస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, జనవరి 3: జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులను రెగ్యులర్ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500లు వేతనాలు చెల్లించాలని వంటి పలు డిమాండ్లతో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బొమ్మల రాము, సంతోశ్, అజయ్‌కుమార్, నూకరాజు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో...

నర్సీపట్నం, జనవరి 3: పారిశుధ్య కార్మికుల సమ్మె బుధవారం 9వ రోజుకి చేరింది. కార్మికులు ఎన్టీఆర్ మినీ స్టేడియం రిలే దీక్షలు చేపట్టారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కరోనా సమయంలో తాత్కాలిక విధులు నిర్వహించిన పారిశుధ్య కార్మికులను విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనసేన నియోజవర్గం ఇన్‌చార్జ్ సూర్యచంద్ర, అద్దేపల్లి గణేశ్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.త్రిమూర్తులురెడ్డి, తదితరులు పారిశుధ్య కార్మికుల దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.



రిలే దీక్షలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

జగనన్న కాలనీలో ఖాళీ స్థలాలు కబ్జా

» దర్జాగా ఇళ్ల నిర్మాణం.. పట్టించుకోని రెవెన్యూ అధికారులు


జగనన్న కాలనీలో ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి చేపట్టిన ఇంటి నిర్మాణం

చోడవరం, జనవరి 3: జగనన్న కాలనీల్లో మిగులు స్థలాలను కొంతమంది కబ్జా చేసి, ఇళ్లు నిర్మించుకుంటున్నారు. పట్టణ శివారు చీడికాడ రోడ్డులోని కాలనీలో చివర మూలన రెండు స్థలాలు మిగిలిపోయాయి. సుమారు ఐదు సెంట్లు వుండడంతో సామాజిక అవసరాలకు ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో అప్పట్లో రెవెన్యూ అధికారులు వదిలేశారు. దీనిపై కన్నేసిన ఓ వ్యక్తి సుమారు సగం స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీనిని చూసి మరో వ్యక్తి మిగిలిన సగం స్థలాన్ని ఆక్రమించి ఇంటిని నిర్మిస్తున్నాడు. కాగా స్థలాల కబ్జాపై అన్నవరం గ్రామానికి చెందిన వెంపలి సీతారామయ్య స్పందనలో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఇంతవరకు పట్టించుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

వైసీపీ నుంచి సర్పంచ్ దంపతుల సస్పెన్షన్

పరవాడ, జనవరి 3: మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు దంపతులను వైసీపీ నుంచి సస్పెండ్ చేసినట్టు పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కోన రామారావు బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో నిర్వహించిన పంచాయతీరాజ్ సదస్సులో సర్పంచ్ భర్త ముత్యాలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మీద, ప్రభుత్వం మీద టీడీపీ నాయకుల ముందు అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశాల మేరకు సర్పంచ్‌తో పాటు ఆమె భర్తను పార్టీ నుంచి బహిష్కరించామని ఆ ప్రకటనలో వెల్లడించారు.

2,67,651 మందికి పింఛన్ కానుక

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



వైఎస్సార్ పింఛన్ కానుక నమూనా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

అనకాపల్లి రూరల్, జనవరి 3: జిల్లాలో 2,67,651 మందికి రూ.77 కోట్ల 90 లక్షల 94 వేలు పింఛన్ కానుక అందిస్తున్నట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. కాకినాడ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకరంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టితో పాటు చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ వీక్షించారు. అనంతరం జిల్లాలోని లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు, సచివాలయ ప్రత్యేక అధికారి మంజులావాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చోడవరం సీహెచ్‌సీ వైద్యాధికారిపై విచారణ


ఆస్పత్రిలో విచారణ జరుపుతున్న నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణి

చోడవరం, జనవరి 3: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తుండడంతోపాటు ప్రైవేటు ప్రాక్టీసు చేస్తున్నారంటూ స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) వైద్యాధికారి వినయ్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై బుధవారం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణి ఇక్కడ విచారణ చేపట్టారు. వైద్యాధికారి వినయ్‌కుమార్ డ్యూటీ సరిగా చేయడం లేదని, రోగులను నిర్లక్ష్యం చేస్తున్నారంటూ అందిన ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేయడానికి వచ్చినట్టు ఆమె చెప్పారు. పనివేళల్లో వైద్యాధికారి ఆస్పత్రిలో ఉంటున్నారా, లేదా అని రోగులను, వైద్య సిబ్బందిని ఆమె ప్రశ్నించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్టు ఆమె తెలిపారు.



అనకాపల్లి
నియోజకవర్గం

అర్హులందరికీ పింఛన్లు : మంత్రి అమర్‌నాథ్


కొత్త పింఛన్‌ను అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

తుమ్మపాల, జనవరి 3 : అర్హులందరికీ రాజకీయాలకు అతీతంగా పింఛన్లు అందిస్తున్నట్టు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. తుమ్మపాలలో కొత్తగా మంజూరైన, పెరిగిన పింఛన్లను ఆయా లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు. ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసీపీ నాయకులు డాక్టర్ విష్ణుమూర్తి, మలసాల భరత్, మళ్ల బుల్లిబాబు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, మలసాల కిశోర్, దంతులూరి దిలీప్‌కుమార్, జోసఫ్, తట్టా పెంటయ్యనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

కొత్తూరులో కాలినడక వంతెనలు ప్రారంభం

కొత్తూరు, జనవరి 3 : మేజర్ పంచాయతీ కొత్తూరులో నూతనంగా నిర్మించిన రెండు కాలినడక వంతెనలను మంత్రి అమర్‌నాథ్, ఎంపీ బి.వి.సత్యవతి బుధవారం ప్రారంభించారు. వైసీపీ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, డాక్టర్ విష్ణుమూర్తి, సర్పంచ్ సప్పారను ప్రసన్నలక్ష్మి, ఎంపీటీసీ సంతోషి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు జోసఫ్, డీఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.

'కశింకోట' కాంగ్రెస్ అధ్యక్షుడిగా గజ్జాలు

కశింకోట, జనవరి 3 : కాంగ్రెస్ పార్టీ కశింకోట మండల అధ్యక్షుడిగా బయ్యవరం గ్రామానికి చెందిన గజ్జాలును నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి తనవంతు కృషిచేస్తానన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ళు అరెస్టు

కశింకోట, జనవరి 3 : తాళ్ళపాలెం శివారులో పేకాట ఆడుతున్న ఐదుగుర్ని బుధవారం అరెస్టు చేసినట్టు అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడిచేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుల నుంచి రూ. 1300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

'అంగన్‌వాడీల అక్రమ అరెస్టు అన్యాయం'

తుమ్మపాల, జనవరి 3 : డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు పోరాటాలు చేస్తుంటే అధికార పార్టీ పోలీసులతో కలిసి అక్రమ అరెస్టులకు పాల్పడుతుండడం అన్యాయమని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కోన లక్ష్మణ అన్నారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నుంచి మద్దతు వస్తుంటే చూడలేని ఓర్వలేని సీఎం ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

టీడీపీలో 'దాడి' చేరికపై సంబరాలు


సంతబయలులో దాడి అభిమానుల సంబరాలు

అనకాపల్లి టౌన్, జనవరి 3 : మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కుటుంబ సభ్యులు టీడీపీలో చేరడంతో ఆయన అభిమానులు బుధవారం సాయంత్రం పట్టణంలోని సంతబయలు, లక్ష్మీనారాయణనగర్‌లోని డీవీఆర్ క్యాంప్ కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకున్నారు. దాడి వీరభద్రరావు, ఆయన కుమారులు జయవీర్, రత్నాకర్ విజయవాడలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. దీంతో పెద్ద సంఖ్యలో దాడి అభిమానులు, అనుచరులు ఇక్కడికి చేరుకుని బాణసంచా కాల్చారు. టీడీపీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు.

గౌరీ సేవా సంఘ కార్యవర్గం ఎన్నిక


కమిటీ సభ్యులతో కొణతాల లక్ష్మీనారాయణ

అనకాపల్లి టౌన్, జనవరి 3 : ఇక్కడి గౌరీపంచాయతన దేవస్థానంలోని గౌరీ సేవా సంఘం నూతన పాలకవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారిగా శరగడం జగదీష్‌తో పాటు 22 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. అలాగే, కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ కల్యాణ మండపం కన్వీనర్‌గా మళ్ల మహాలక్ష్మినాయుడు, అయ్యప్ప ఆలయ కన్వీనర్‌గా మళ్ల సూర్య ప్రకాశరావు, మళ్ల జగన్నాథం కల్యాణ మండపం నిర్మాణ కమిటీ కన్వీనర్ పెంటకోట సుబ్రహ్మణ్యం, కో-కన్వీనర్‌గా బుద్ద రమణాజీలను ఎన్నుకున్నారు. వీరిని వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ అభినందించారు.

టిడ్కో గృహాలను పరిశీలించిన చైర్మన్


గృహాలను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రసన్నకుమార్

కొత్తూరు, జనవరి 3 : సత్యనారాయణపురంలో టిడ్కో గృహాలను ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ బుధవారం పరిశీలించారు. గురువారం ఈ గృహాలను లబ్ధిదారులకు అందజేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం గృహ సముదాయాలను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఈ నర్సింహరావు, ఈఈ సుధాకర్, డిఈఈ సంధ్య ఉన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు

కొత్తూరు, జనవరి 3 : మేజర్ పంచాయతీ కొత్తూరు ఎర్రచెరువులో అక్రమంగా నిర్మించిన పునాదులను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. 'కొత్తూరులో చెరువు కబ్జా' శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు వీఆర్‌వో భరద్వాజ్ సిబ్బందితో వచ్చి ఆక్రమణలను తొలగించారు. కాగా చెరువును ఆనుకొని అనధికారికంగా మరికొన్ని నిర్మాణాలు ఉన్నాయని వాటిని కూడా తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇకపై ఎటువంటి అక్రమ నిర్మాణాలు జరిగినా పూర్తి బాధ్యత అధికారులదేనని సర్పంచ్ లక్ష్మీప్రసన్న తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సబ్బవరం : జీవీఎంసీ 88వ వార్డు పరిధి అజనగిరి, వెదుళ్లనరవల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. తహసీల్దార్ బి. సత్యనారాయణ ఆదేశాల మేరకు డీటీ వెంకట్, ఆర్ఐ వీరయ్య, వీఆర్వో వెంకటేశ్ బుధవారం సిబ్బందితో బుధవారం ఆయా ప్రాంతాలకు వెళ్లి ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగించారు. అంతాకాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కాళ్ళ వెంకట సత్యనారాయణ


వెంకట సత్యనారాయణ

కొత్తూరు, జనవరి 3 : కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కాళ్ళ వెంకట సత్యనారాయణ నియామకమయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు బుధవారం ఉత్త ర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలు నాయకులు, కార్యకర్తలు పురు అభినందించారు.

పెందుర్తి
నియోజకవర్గం

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే


వృద్ధురాలికి పింఛన్ నగదు అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్

పరవాడ, జనవరి 3 : పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. నూతన పింఛన్ కానుక పెంపు వారోత్సవాల్లో భాగంగా బుధవారం వెన్నెలపాలెంలో లబ్ధిదారులకు పింఛన్ అందజేసి మాట్లాడారు. ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి, జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, ఎంపీడీవో హేమసుందరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ కాలనీలో ఇంటి పన్నులపై వినతి


ఎంపీడీవోకు వినతిని అందిస్తున్న టీడీపీ నాయకులు

పరవాడ, జనవరి 3 : వెన్నెలపాలెం పంచాయతీ హనుమాన్ కాలనీలో ఇంటి పన్నుల వ్యవహారంపై విచారణ జరిపించాలని టీడీపీ నాయకులు పైలా రథాల సన్యాసిరావు, లోకిరెడ్డి అభిసన్యాసినాయుడు, పైలా ప్రసాద్, బోజంకి నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో హేమసుందరరావుకు వినతిపత్రం అందజేశారు.

అనకాపల్లి నుంచి అమర్ అవుట్!

... 5వ పేజీ తరువాయి

నియమితులు అవుతారని ధీమాగా చెబుతున్నారు.

పార్టీ అంతర్గత సర్వే రిపోర్టే కారణం?

గాజువాక ప్రాంతానికి చెందిన మంత్రి అమర్‌నాథ్‌కు అనకాపల్లికి స్థానికేతరుడుగా ముద్ర పడింది. అద్దె భవనంలో క్యాంపు కార్యాలయం మినహా నాలుగున్నరేళ్లగా స్థానికంగా నివాసం ఏర్పాటు చేసుకోలేదు. ప్రభుత్వ లేదా పార్టీ కార్యక్రమాలు వుంటే ఉదయం ఇక్కడకు వచ్చి, సాయంత్రం తిరిగి వెళ్లిపోతుంటారు. దీంతో నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో వుండడం లేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. వీటికి తోడు గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో నిర్వహించలేకపోయారు. మొత్తం మీద అమర్ తీరుపై నియోజకవర్గం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని వైసీపీ అధిష్ఠానం నిర్వహించిన అంతర్గత సర్వేల్లో తేలడంతో వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి టికెట్ ఇవ్వకూడదని నిర్ణయించినట్టు తెలిసింది. మలసాల భరత్‌కుమార్‌ను సమన్వయకర్తగా నియమించడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నది.

ఎంపీగా పోటీ!

ఇదిలావుండగా సామాజిక సమీకరణాల్లో భాగంగా మంత్రి అమర్‌ను ఈసారి అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి బరిలోకి దించే ఆలోచనలో పార్టీ అధిష్ఠానం ఉందని, త్వరలో విడుదల కానున్న వైసీపీ సమన్వయకర్తల మలి జాబితాలో అమర్ పేరు ఉంటుందనే పార్టీలో ప్రచారం జరుగుతున్నది.

అసెంబ్లీకే అమర్ ఆసక్తి?

వచ్చే ఎన్నికల్లో పార్లమెంటుకు కాకుండా అసెంబ్లీకే పోటీ చేయాలని అమర్ భావిస్తున్నట్టు అనుచరులు చెబుతున్నారు. తన సామాజికవర్గం ఓటర్లు ఎక్కువగా వున్న ఎలమంచిలి, చోడవరం, పెందుర్తి నియోజకవర్గాల్లో ఏదో ఒకచోట నుంచి పోటీకి అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇస్తుందని సన్నిహితులకు చెబుతున్నట్టు సమాచారం.

టిడ్కో గృహాలతో ఓట్లకు ఎర

... 5వ పేజీ తరువాయి

అప్పగించాలని లబ్ధిదారులు పలుమార్లు ప్రజాప్రతినిధులను, అధికారులను కోరడంతో ఎట్టకేలకు ప్రభుత్వంలో కదలిక వచ్చింది. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించడానికి తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ పనులు చేట్టారు. భవనాలకు టీడీపీ హయాంలో వేసిన రంగులపై వైసీపీ జెండాలో వున్న రంగులు వేసేశారు. సత్యనారాయణపురంలో 2,096 మంది లబ్ధిదారులకు గురువారం టిడ్కో ఇళ్లను అప్పగించనున్నది. మునిసిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేశ్, ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర, వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా టిడ్కో గృహాలను లబ్ధిదారుకు అందజేయనున్నారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

... 5వ పేజీ తరువాయి

పెరిగిపోయి, కుటుంబ పోషణ భారంగా మారిన పరిస్థితుల్లో అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం శోచనీయమని అన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యుటీ అమలు చేయాలని, అంగన్‌వాడీ హెల్పర్‌లను పూర్తిస్థాయి వర్కర్లుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, గౌరవాధ్యక్షురాలు జి.కుమారి, సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, ఏఐటీయూసీ నాయకులు వైఎన్ భద్రం, రాజాన దొరబాబు, కోన లక్ష్మణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతలు రొంగలి సత్య, నవర మణి, జి.కృష్ణవేణి, ఆశాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు. కాగా నెహ్రూచౌక్‌ను అంగన్‌వాడీలు దిగ్బంధం చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

పాయకరావుపేట
నియోజకవర్గం

కాంగ్రెస్ నేతలకు జిల్లా స్థాయి పదవులు

పాయకరావుపేట, జనవరి 3: నియోజకవర్గంలోని పలువురు నాయకులకు కాంగ్రెస్ జిల్లా స్థాయి పదవులు వరించాయని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవులు పొందిన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన జిల్లా కార్యవర్గంలో నియోజకవర్గానికి చెందిన మేడేటి శంకరరావు, ఎస్ఎస్‌వీ.సత్యనారాయణలను జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించినట్టు చెప్పారు. అలాగే మరి కొందరికి పదవులు లభించినట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నడింపల్లి నూకరాజు, మద్దూరి సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

నరసింహుడుగా పాండురంగడు



పాయకరావుపేట: పాండురంగ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామివారు బుధవారం నరసింహస్వామి అవతారంలో దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఈవో ఎన్.వెంకటేశ్వరరావు స్వామివారిని దర్శించుకుని తరించారు.

ఉపమాక తిరువీధుల్లో దేవదేవుని ఊరేగింపు

నక్కపల్లి, జనవరి 3: ఉపమాక క్షేత్రంలోని మాడవీధుల్లో బుధవారం వేంకటేశ్వరస్వామివారి ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. రాజాధిరాజ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారు పల్లకీపై గోదాదేవి అమ్మవారు మాడవీదుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తిరువీధి ఉత్సవం అనంతరం ఆలయంలో గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద తిరుప్పావై పాశురము విన్నపం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

శబరిమలకు సైకిల్ యాత్ర


శబరిమలకు వెళ్తున్న స్వాములు

నక్కపల్లి, జనవరి 3: నక్కపల్లికి చెందిన ముగ్గురు అయ్యప్ప దీక్షాపరులు బుధవారం సైకిల్‌పై శబరిమల యాత్రకు బయలు దేరారు. కొల్లాటి సాయి, జి.అప్పారావు, అల్లాడ చిన్న అయ్యప్ప మండల దీక్ష స్వీకరించారు. మకర సంక్రాంతి రోజున అయ్యప్ప జ్యోతి దర్శనం కోసం బుధవారం ఉదయం బయలుదేరారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. స్థానిక పెద్దలు, పలువురు భక్తులు వీరి యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

పరిశ్రమలపై ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ


పార్టీ ఇన్‌చార్జులతో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం రూరల్, జనవరి 3: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో పరిశ్రమలు మూతపడే స్థాయికి చేరుకున్నాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. అనకాపల్లి జిల్లాలో కనీసం ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేని స్థితిలో మంత్రి అమర్ ఉన్నారన్నారు. సెజ్ నిర్వాసితులకు, స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసిన నాయకులు, ప్రభుత్వం వచ్చాక మొండి చేయి చూపించారని వాపోయారు. స్థానికులు రోడ్డున పడే పరిస్థితి రావడంతో, వారికి అండగా నిలవాలని తీర్మానించారు. సమావేశంలో నాలుగు మండలాల నాయకులు రంగనాయకులు, జనపరెడ్డి నరసింగరావు, దొడ్డి శ్రీను, దినబాబు పాల్గొన్నారు.

సెజ్ కాలనీల్లో టీడీపీకి పూర్వవైభవం: పప్పల

టీడీపీకి కంచుకోటగా ఉండే దిబ్బపాలెం, సెజ్ పునరావాస కాలనీ పూర్వ వైభవం సంతరించుకుంటుందని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు తెలిపారు. సెజ్ కాలనీలో టీడీపీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అంతా పనిచేయాలని కోరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఈ కాలనీని ఎంతో అభివృద్ధి చేశామని, ప్రస్తుతం అభివృద్ధి కుంటిపడడంతో పాటు అక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి పార్టీలోకి చేరిన పలువురిని కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ భాస్కర్, నాయకులు రమేష్‌కుమార్, జె.నరసింగరావు, వి.దినబాబు, జి.నానాజీ, ఎం.బాపునాయుడు, ఎల్.సత్యప్రసాద్, పి.కొండబాబు, ఎల్.రమేష్ నాయుడు, లాలం రాజు, నరసింగరావు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈపై విజిలెన్స్ విచారణ

పాయకరావుపేట, జనవరి 3: విద్యుత్ మీటర్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి ఏఈ లంచం డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. విజిలెన్స్ ఎస్ఐ ప్రభాకర్, సిబ్బంది గిరిబాబు బాధితుల ఫిర్యాదులను రాతపూర్వకంగా సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత జగతా శ్రీనివాస్, బాధితులు ఎం.రాజేష్, కట్టా అప్పారావు, డి.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ఎస్ఐగా రమణయ్య బాధ్యతల స్వీకారం



కోటవురట్ల, జనవరి 3: కోటవురట్ల ఎస్ఐగా రమణయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మూడేళ్లుగా పనిచేస్తున్న ఎస్ఐ నారాయణరావును సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలీసు ఉన్నతాధికారులు చీడికాడ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. అతని స్థానంలో విశాఖ నుంచి రమణయ్యను నియమించారు. శాంతిభద్రత పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తానని ఈ సందర్భంగా రమణయ్య చెప్పారు. ఇందుకు ప్రజలకు సహకరించాలని కోరారు.

'రాజకీయ ప్రాధాన్యం కల్పించకపోతే ఆందోళన'

ఎస్.రాయవరం, జనవరి 3: రెల్లి కులస్థులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించకపోతే ఆందోళనకు దిగుతామని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి పాపారావు తెలిపారు. అడ్డరోడ్డులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గంలో అన్ని రంగాల్లో వెనుబడిన రెల్లి కులస్థులకు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. రెల్లి కులస్థులపై ప్రభుత్వం చిన్న చూపు చూడడం తగదన్నారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు బవిరిశెట్టి కన్నారావు, నాలుగు మండలాల నాయకులు బంగార్రాజు, సుబ్రహ్మణ్యం, అప్పారావు, భవిశెట్టి అప్పారావు, కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ సర్పంచ్ టీడీపీలో చేరిక

నక్కపల్లి, జనవరి 3: అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకరరావు బుధవారం వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీలో చేరారు. శంకరరావుతో పాటు మరికొందరికి అనిత కండువాలు వేసి పార్టీకి ఆహ్వానించారు. తనపై నమ్మకంతో పార్టీలో చేరిన వారందరికీ ఆమె కృతజతలు తెలిపారు. అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, కె.నూకరాజు, జానకి శ్రీను, ఎ.అబద్ధం పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల మందు పార్టీపై బాలల హక్కుల కమిషన్ సీరియస్

... 5వ పేజీ తరువాయి

పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు కొందరు గత నెల 31వ తేదీ రాత్రి హాస్టల్ పక్కనే నిర్మాణంలో వున్న ఒక భవనంలో మందు, విందు పార్టీ చేసుకున్నారు. దీనిపై బుధవారం పత్రికల్లో కథనాలు రావడంతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పందించింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక అందించాలని కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, బుధవారం బీసీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. నివేదిక ఆధారంగా బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలకు ఆదేశిస్తామని ఆయన పేర్కొన్నారు.

కాగా ప్రభుత్వపరంగా వచ్చిన ఆదేశాల మేరకు ఎంఈవో జయలక్ష్మి బుధవారం బీసీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. వార్డెన్, విద్యార్థులతో మాట్లాడి వివరాలను సేకరించారు. కాగా హాస్టల్‌లో మందు పార్టీ, తదనంతరం స్థానిక యువకులతో ఘర్షణ, ఇతర అంశాలపై పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. హాస్టల్‌లో మందు పార్టీ వ్యవహారం సీరియస్‌గా మారడంతో వసతిగృహం వార్డెన్‌పై క్రమశిక్షణ చర్యలకు అధికారులు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది.

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం

... 5వ పేజీ తరువాయి

ప్రతిభా భారతి, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, కిడారి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యే పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నియోజకవర్గ ఇన్‌చార్జులుగా ఉన్న గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, గిడ్డి ఈశ్వరి, కోరాడ రాజబాబు, పార్టీ నేతలు పాశర్ల ప్రసాద్, పట్టాభి, తదితరులు స్వాగతం పలికారు.

ఎలమంచిలి
నియోజకవర్గం

నారా భువనేశ్వరిని కలిసిన ప్రగడ



ఎలమంచిలి, జనవరి 3: నిజం గెలవాలి యాత్రలో భాగంగా ఉత్తరాంధ్ర పర్యటనకు బుధవారం విశాఖ విచ్చేసిన నారా భువనేశ్వరిని విమానాశ్రయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ నేతలతో కలిసి భువనేశ్వరికి ఆయన పుష్పగుచ్ఛం అందించారు.

కొనసాగుతున్న అభిజిత్ కార్మికుల నిరసనలు

అచ్యుతాపురం రూరల్, జనవరి 3: సెజ్ పరిధిలోని అభిజీత్ ఫెర్రోటెక్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికుల ఆందోళన కొనసాగుతున్నది. బుధవారం నాటికి మూడో రోజుకు చేరింది. కంపెనీలో కనీసం 26 రోజుల పనిదినాలు కల్పించాలనే డిమాండ్‌తో ఈ కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ నేత రొంగలి రాము మాట్లాడుతూ జనవరి 1 నుంచి చట్ట విరుద్ధంగా నెలకు 15 రోజులు పని దినాలు ఇస్తామని యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో సేవలపై ఐఎస్‌వో అధికారుల ఆరా

అచ్యుతాపురం రూరల్, జనవరి 3: తహసీల్దార్ కార్యాలయంలో అందిస్తున్న సేవలపై ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్‌వో) అధికారులు ఆరా తీశారు. ఐఎస్‌వో అధికారి అనిత ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యాలయ పరిధిలో జారీ చేసే ధ్రువపత్రాలు, ప్రాథమిక చికిత్స కిట్లు ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్వహణ, అగ్ని ప్రమాద నిరోధక చర్యలను బృందం పర్యవేక్షించారు. తహసల్దార్, సిబ్బంది వారికి వివిధ ఏర్పాట్లను చూపించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ కుమారస్వామి, ఆర్ఐ కుమార్, వీఆర్‌వోలు శశిధర్, సత్య పాల్గొన్నారు.

జంపపాలెంలో కనకదుర్గమ్మ సారె ఊరేగింపు

ఎలమంచిలి, జనవరి 3: జంపపాలెం గ్రామంలో బుధవారం కనకదుర్గమ్మ సారె ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు మాలాధారణ భక్తులంతా కలిసి గ్రామవీధుల్లో సారె ఊరేగింపు నిర్వహించారు. దుర్గామాత నామస్మరణ చేసుకుంటూ ఆలయానికి చేరుకున్నారు.

మునిసిపల్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె

ఎలమంచిలి, జనవరి 3: మునిసిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు బుధవారం నుంచి సమ్మెబాట పట్టారు. డిమాండ్లు నెరవేర్చాలని మునిసిపల్ కార్యాలయం వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వై.నూకరాజు, మహేష్, వెంకటరమణ, నాగరాజు, కన్నాజీ పాల్గొన్నారు.

అరకు కాఫీకి అరుదైన గుర్తింపు

పాడేరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో వివిధ జిల్లాల్లో ప్రాచుర్యం పొందిన ఉత్పత్తులకు 'వన్ డిస్ట్రిక్ట్..వన్ ప్రొడక్ట్' పేరిట ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా బుధవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అరకు కాఫీకి బంగారు పతకం లభించింది. వివిధ రాష్ట్రాల్లో వున్న ప్రత్యేక ఉత్పత్తుల వివరాలను గత ఏడాది సెప్టెంబరులో సేకరించింది. అక్టోబరు నెలలో ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యేక ఉత్పత్తుల పరిశీలన జరిపింది. ఆ విధంగా గత ఏడాది అక్టోబరు 14న కేంద్ర బృందం సభ్యులు పాడేరు, అరకులోయ ప్రాంతాల్లో పర్యటించి ఇక్కడ కాఫీ సాగు, తదితర వివరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావులను అడిగి తెలుసుకున్నారు. కాగా బుధవారం ఢిల్లీలో నిర్వహించిన 'వన్ డిస్ట్రిక్ట్..వన్ ప్రొడక్ట్' ఎంపిక ప్రక్రియకు దేశవ్యాప్తంగా 64 ఉత్పత్తులు రాగా, వాటిలో 14 ఉత్పత్తులకు గుర్తింపు లభించింది. వాటిలో మన రాష్ట్రం నుంచి ఎంపికైన ఆరు ఉత్పత్తుల్లో అరకు కాఫీ ఒకటి కావడం విశేషం. మన్యం కాఫీకి బంగారు పతకం లభించింది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే బాబూరావు


పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం/పాయకరావుపేట రూరల్, జనవరి 3: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల్లో బుధవారం పింఛన్ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి డాక్టర్ మహేష్, ఎంపీడీవో రామచంద్రమూర్తి, వైస్ ఎంపీపీలు బొలిశెట్టి గోవిందరావు, చోడిపల్లి అప్పన్న, సర్పంచ్ భూపతి అప్పారావు, వైసీపీ నేత పోలిశెట్టి పెద ఈశ్వరరావు పాల్గొన్నారు. పాయకరావుపేటలోని శ్రీరాంపురంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్యే బాబూరావు పింఛన్లను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీటీసీ లంక సూర్యనారాయణ, నాయకులు వి.రామకృష్ణ, తాతారావు, డి.రాజేశ్‌ఖన్నా, సిహెచ్.శ్రీనువాసరావు, జె.శ్రీనివాసరావు, తాతాజీ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే కన్నబాబురాజు


పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఎలమంచిలి/రాంబిల్లి, జనవరి 3: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌దేనని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. ఎలమంచిలి, రాంబిల్లిలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలనే కాకుండా ఊహించని రీతిలో అభివృద్ధి, సంక్షేమాన్ని అందించిన ఘనత జగన్‌దేనన్నారు. సోమలింగపాలెంలో సురక్ష యోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే పంచదార్ల ఉన్నత పాఠశాలలోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, కమిషనర్ కొండబాబు, తహసీల్దార్ రాణి అమ్మాజీ, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, ఏఎంసీ చైర్మన్ యర్రయ్యదొర, రాంబిల్లి ఎంపీపీ జి.శిరీషాశ్రీనుబాబు, జడ్‌పీటీసీ సభ్యులు డి.నాగరాజు, సర్పంచ్ డి.బుజ్జి, వైసీపీ మండల కన్వీనర్ పి.కిశోర్, ఎంపీడీవో కొండలరావు పాల్గొన్నారు.

పుష్కరిణా.. డంపింగ్ యార్డా?

చోడవరం, జనవరి 3: ఉత్తరాంధ్రలోనే ప్రముఖ శైవక్షేత్రంగా పేరొందిన స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయం పుష్కరిణి చెత్తాచెదారంతో నిండిపోయింది. నిత్యం అనేకమంది భక్తులు దర్శించుకునే గౌరీశ్వరాలయం సమీపంలోని పుష్కరిణి అధ్వానంగా మారిపోయింది. కనీసం కాళ్లు కడుగుకునే వీలు కూడా లేకపోవడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు.

- అధ్వానంగా స్వయంభూ గౌరీశ్వరాలయం కొలను
- పుణ్య స్నానాలు ఆచరించే అవకాశం లేక భక్తుల ఇక్కట్లు
- పట్టించుకోని దేవదాయ శాఖ అధికారులు


స్వయంభూ గౌరీశ్వరాలయం


మురికికూపంగా మారిన పుష్కరిణి

స్వయంభూగా వెలసిన గౌరీశ్వరుడిని దర్శించుకుని పూజలు చేయడానికి ఎంతో మంది భక్తులు ఈ ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. అటువంటి ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయం పుష్కరిణి మురికికూపంగా మారిపోయింది. పుష్కరిణిలోకి బయట నుంచి వచ్చే మురుగునీరు చేరి అలాగే ఉండిపోతుండడంతో పాటు పుష్కరిణిలో పడేసే వ్యర్థాలతో ఈ కొలను డంపింగ్ యార్డుగా మారిపోయింది. దీంతో ఆలయంలోకి



పుష్కరిణిని పరిశుభ్రంగా ఉంచాలంటూ ఏర్పాటు చేసిన బోర్డు

ముక్కుమూసుకుని వెళ్లవలసిన దుస్థితి ఏర్పడింది.

ఈ కొలను లో వ్యర్థాల వల్ల దుర్గంధం వెదజల్లడంతో పరిసర ప్రాంతాల వారు ఇబ్బందులు పడు తున్నారు. గతంలో ఈ పుష్కరిణిని బాగు చేయడానికి ఇక్కడ పనిచేసిన అటవీశాఖ అధికారి బి.రాంనరేశ్ నేతృత్వంలో స్థానికంగా కొందరు పెద్దలు కమిటీగా ఏర్పాటై, పుష్కరిణి పరిసరాలు బాగు చేయడంతో పాటు, పుష్కరిణిని చక్కదిద్దే చర్యలు చేపట్టారు. ఆ తరువాత ఆయన బదిలీపై వెళ్లిపోవడంతో ఆ కార్యక్రమం నిలిచిపోయింది. ఇక స్థానికంగా ఉన్న పెద్దలు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సైతం ఈ పుష్కరిణిని పట్టించుకోకపోవడంతో, ఇది భక్తులకు అందుబాటులో లేకుండా పోయింది. గతం లో కార్తీక మాసం సందర్భంగా ఈ పుష్కరిలో భక్తులు స్నానాలు చేయడం, కార్తీక దీపాలు వదలడం చేసేవారు. ఈ పుష్కరిణి దారుణంగా తయారవ్వడంతో భక్తులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కున్నారు. ఈ ఆలయం నుంచి వచ్చే ఆదాయంపైనే దృష్టి సారించే దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులు, ఈ ఆలయంలో సౌకర్యాల పట్ల గాని, పుష్కరిణి అభివృద్ధి గురించి గానీ పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, దేవదాయశాఖ అధికారులు ఈ ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

అద్దె ఒప్పందం ఉల్లంఘనపై ఆర్టీసీ అధికారులు విచారణ

రావికమతం, జనవరి 3 : మండల కేంద్రం రావికమతంలో ఆర్టీసీ కాంప్లెక్స్ అద్దె అగ్రిమెంట్ ఉల్లంఘనపై బుధవారం ఏపీఎస్ ఆర్టీసీ నర్సీపట్నం డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎస్.ఎస్.నాయుడు విచారణ జరిపారు. రావికమతంలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ప్రయాణికుల తాకిడి లేదన్న సాకుతో పదేళ్లక్రితం ఈ కాంప్లెక్స్‌ను గ్రామానికి చెందిన ఓ డీలర్‌కు అద్దెకు ఇచ్చారు. దీనిని అద్దెకు తీసుకున్న వ్యక్తి కాంట్రాక్టుకు విరుద్ధంగా కాంప్లెక్స్‌ను వినియోగిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఇక్కడ విచారణకు విచ్చేసినట్టు అసిస్టెంట్ డిపో మేనేజరు తెలిపారు. అయితే అగ్రిమెంట్‌కు భిన్నంగా ప్రస్తుతం ఇక్కడ షాపులు ఉన్నాయని, దీనిపై నర్సీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు నివేదిక ఇవ్వనున్నామని చెప్పారు.

ఉపాధి హామీ పథకం పనులపై ప్రజావేదిక

రోలుగుంట, జనవరి 3 : ఉపాధి హామీ పథకం పనులపై చేపట్టిన సామాజిక తనిఖీల నివేదికపై బుధవారం ఇక్కడి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. జిల్లా ఏపీడీ రోజారమణి, జిల్లా విజిలెన్స్ అధికారిణి నిర్మలాదేవిల సమక్షంలో మండలంలోని అన్ని గ్రామాల్లో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించిన నివేదికలను గ్రామాల వారీగా డీఆర్పీలు చదివి వినిపించారు. పలు గ్రామాల్లో చేపట్టిన పనుల్లో లోపాలపై పలువురు ప్రశ్నలు సంధించారు. దీంతో ఆయా పనులపై సమగ్ర దర్యాప్తు జరుపుతామని ఏపీడీ తెలిపారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ నూకరాజు, ఏపీవో సూర్యమణి తదితరులు పాల్గొన్నారు.

'అర్హులందరికీ సంక్షేమ ఫలాలు'

రావికమతం/రోలుగుంట, జనవరి 3 : కొత్తగా మంజూరైన పింఛన్లతో పాటు ఈ నెల నుంచి పెరిగిన పింఛన్ల నగదును ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఆయా లబ్ధిదారులకు విప్ కరణం ధర్మశ్రీ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీ పైల రాజు, ఎంపీడీవో వెంకన్నబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మినాయుడు, కంచిపాటి జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, రోలుగుంట ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, గొర్లె చెల్లమ్మనాయుడు, దోశపత్ని రాజు, మడ్డు అప్పలనాయుడు పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం : కొత్తగా మంజూరైన ఫించన్లు, పెంచిన రూ.మూడు వేల పింఛన్లను ఆయా లబ్ధిదారులకు బుధవారం ఇక్కడ ఎమ్మెల్యే గణేశ్ పంపిణీ చేసి మాట్లాడారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు షైనం నాగవెంకట గోపీ, పైల సునీల్, ఎంపీడీవో ఎన్.హనుమంతరావు వైసీపీ నాయకులు కరక అప్పలరాజు, కాపారపు అప్పలనర్స లగుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలతో ఓట్లకు ఎర

... 5వ పేజీ తరువాయి

అప్పగించాలని లబ్ధిదారులు పలుమార్లు ప్రజాప్రతినిధులను, అధికారులను కోరడంతో ఎట్టకేలకు ప్రభుత్వంలో కదలిక వచ్చింది. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించడానికి తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ పనులు చేట్టారు. భవనాలకు టీడీపీ హయాంలో వేసిన రంగులపై వైసీపీ జెండాలో వున్న రంగులు వేసేశారు. సత్యనారాయణపురంలో 2,096 మంది లబ్ధిదారులకు గురువారం టిడ్కో ఇళ్లను అప్పగించనున్నది. మునిసిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేశ్, ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పీడిక రాజన్నదొర, వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా టిడ్కో గృహాలను లబ్ధిదారుకు అందజేయనున్నారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

... 5వ పేజీ తరువాయి

పెరిగిపోయి, కుటుంబ పోషణ భారంగా మారిన పరిస్థితుల్లో అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం శోచనీయమని అన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యుటీ అమలు చేయాలని, అంగన్‌వాడీ హెల్పర్‌లను పూర్తిస్థాయి వర్కర్లుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, గౌరవాధ్యక్షురాలు జి.కుమారి, సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, ఏఐటీయూసీ నాయకులు వైఎన్ భద్రం, రాజాన దొరబాబు, కోన లక్ష్మణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతలు రొంగలి సత్య, నవర మణి, జి.కృష్ణవేణి, ఆశాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు. కాగా నెహ్రూచౌక్‌ను అంగన్‌వాడీలు దిగ్బంధం చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి వాహనాలను ఇతర మార్గాల్లోకి మళ్లించారు.

హాస్టల్ విద్యార్థుల మందు పార్టీపై....

... 5వ పేజీ తరువాయి

పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు కొందరు గత నెల 31వ తేదీ రాత్రి హాస్టల్ పక్కనే నిర్మాణంలో వున్న ఒక భవనంలో మందు, విందు పార్టీ చేసుకున్నారు. దీనిపై బుధవారం పత్రికల్లో కథనాలు రావడంతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పందించింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక అందించాలని కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, బుధవారం బీసీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. నివేదిక ఆధారంగా బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలకు ఆదేశిస్తామని ఆయన పేర్కొన్నారు.

కాగా ప్రభుత్వపరంగా వచ్చిన ఆదేశాల మేరకు ఎంఈవో జయలక్ష్మి బుధవారం బీసీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. వార్డెన్, విద్యార్థులతో మాట్లాడి వివరాలను సేకరించారు. కాగా హాస్టల్‌లో మందు పార్టీ, తదనంతరం స్థానిక యువకులతో ఘర్షణ, ఇతర అంశాలపై పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. హాస్టల్‌లో మందు పార్టీ వ్యవహారం సీరియస్‌గా మారడంతో వసతిగృహం వార్డెన్‌పై క్రమశిక్షణ చర్యలకు అధికారులు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది.

అనకాపల్లి నుంచి అమర్ అవుట్!

... 5వ పేజీ తరువాయి

నియమితులు అవుతారని ధీమాగా చెబుతున్నారు.

పార్టీ అంతర్గత సర్వే రిపోర్టే కారణం?

గాజువాక ప్రాంతానికి చెందిన మంత్రి అమర్‌నాథ్‌కు అనకాపల్లికి స్థానికేతరుడుగా ముద్ర పడింది. అద్దె భవనంలో క్యాంపు కార్యాలయం మినహా నాలుగున్నరేళ్లుగా స్థానికంగా నివాసం ఏర్పాటు చేసుకోలేదు. ప్రభుత్వ లేదా పార్టీ కార్యక్రమాలు వుంటే ఉదయం ఇక్కడకు వచ్చి, సాయంత్రం తిరిగి వెళ్లిపోతుంటారు. దీంతో నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో వుండడం లేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. వీటికి తోడు గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో నిర్వహించలేకపోయారు. మొత్తం మీద అమర్ తీరుపై నియోజకవర్గం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని వైసీపీ అధిష్ఠానం నిర్వహించిన అంతర్గత సర్వేల్లో తేలడంతో వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి టికెట్ ఇవ్వకూడదని నిర్ణయించినట్టు తెలిసింది. మలసాల భరత్‌కుమార్‌ను సమన్వయకర్తగా నియమించడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నది.

ఎంపీగా పోటీ!

ఇదిలావుండగా సామాజిక సమీకరణాల్లో భాగంగా మంత్రి అమర్‌ను ఈసారి అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి బరిలోకి దించే ఆలోచనలో పార్టీ అధిష్ఠానం ఉందని, త్వరలో విడుదల కానున్న వైసీపీ సమన్వయకర్తల మలి జాబితాలో అమర్ పేరు ఉంటుందనే పార్టీలో ప్రచారం జరుగుతున్నది.

అసెంబ్లీకే అమర్ ఆసక్తి?

వచ్చే ఎన్నికల్లో పార్లమెంటుకు కాకుండా అసెంబ్లీకే పోటీ చేయాలని మంత్రి అమర్ భావిస్తున్నట్టు ఆయన అనుచరులు చెబుతున్నారు. తన సామాజికవర్గం ఓటర్లు ఎక్కువగా వున్న ఎలమంచిలి, చోడవరం, పెందుర్తి నియోజకవర్గాల్లో ఏదో ఒకచోట నుంచి పోటీ చేయడానికి అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇస్తుందని ఆయన తన సన్నిహితులకు చెబుతున్నట్టు సమాచారం.

సమగ్ర శిక్ష సిబ్బంది రిలే నిరాహార దీక్షలు

నర్సీపట్నం, జనవరి 3 : విద్యా శాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది రిలే నిరాహార దీక్షలకు దిగారు. డిమాండ్ల పరిష్కారానికి గత నెల 20 నుంచి సదరు సిబ్బంది నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం ఇక్కడి ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద తమపట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. వీరికి జనసేన నాయకులు సూర్యచంద్ర, అద్దేపల్లి గణేశ్ సంఘీభావం తెలిపారు. ఇదిలావుంటే, నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బందికి బుధవారం పీఆర్‌టీయూ నర్సీపట్నం, గొలుగొండ మండల శాఖలు తరఫున రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, నర్సీపట్నం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అడిగర్ల వరహాలనాయుడు, జీవీ రమేష్, గొలుగొండ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీరామ్మూర్తి, రమణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు కురచా రమణ తదితరులు పాల్గొన్నారు.


నర్సీపట్నంలో రిలేదీక్షలు చేపడుతున్న సమగ్ర శిక్ష సిబ్బంది

కొత్త భూ హక్కు చట్టంతో ప్రజా ఆస్తులకు రక్షణ కరువు

- న్యాయవాదులు అభిప్రాయం
- హైకోర్టు ఆదేశాలపై సంబరాలు

చోడవరం, జనవరి 3 : వైసీపీ ప్రభుత్వం అమలు చేయ తలపెట్టిన భూహక్కు చట్టం 2023పై హైకోర్టులో కేసులు కొనసాగుతున్న నేపథ్యంలో కోర్టులలో దాఖలయ్యే సివిల్ కేసులు తిరస్కరించవద్దంటూ హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేయడాన్ని స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు స్వాగతించారు. ఈ కొత్త భూ హక్కు చట్టం వల్ల ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోవడంతో పాటు, అధికారులకు అపరిమిత అధికారాల వల్ల అనర్థాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందంటూ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కొద్దిరోజులుగా నిరాహార దీక్షలు కూడా చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో నిరంకుశ చట్టానికి బ్రేకులు పడినట్టేనని బార్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొంటూ స్వీట్లు పంచుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాండ్రేగుల డేవిడ్, గొర్లె కృష్ణవేణి, పోతల ప్రకాశరావు, అల్లు గిరిధర్, గూనూరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


హైకోర్టు ఆదేశాలపై స్వీట్లు పంచుకుంటున్న న్యాయవాదులు

మానసిక సమస్యలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

చోడవరం, జనవరి 3 : మానసిక సమస్యలను విద్యార్థులు అధిగమించే అంశంపై పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా మానసిక ఆరోగ్య సంస్థ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సదస్సులో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రమేష్‌కుమార్, జిల్లా మానసిక ఆరోగ్య సంస్థ సైకాలజిస్టులు జి.సాయిలక్ష్మి, మధులత మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక వ్యాధులు, వాటి లక్షణాలు, అధిగమించే తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సమన్వయకర్త రమేష్‌కుమార్

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డిప్యూటీ డీఈవో

దేవరాపల్లి, జనవరి 3 : మండల కేంద్రం దేవరాపల్లిలోని ఉన్నత పాఠశాలను ఎలమంచిలి డివిజన్ డిప్యూటీ డీఈవో అప్పారావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, పదో తరగతి విద్యార్థుల విద్యాభ్యాసం తదితరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పడాల్ దాస్, ఉషారాణి, ఎల్.సత్యనారాయణ, పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

రాజాంలో దివ్యాంగుల సమావేశం

బుచ్చెయ్యపేట, జనవరి 3 : మండలంలోని రాజాం గ్రామంలో గల మరిడిమాంబ ఆలయం వద్ద ఈనెల ఏడో తేదీన మండల దివ్యాంగుల సమావేశం నిర్వహించనున్నట్టు దివ్యాంగుల సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులంతా హాజరు కావాల్సిందిగా కోరారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి

బుచ్చెయ్యపేట, జనవరి 3 : లూయిస్ బ్రెయిలీ జయంతిని దిబ్బిడి జడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కె.సత్యారావు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

నాతవరంలో షూటింగ్ సందడి


హీరో, హీరోయిన్‌పై క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే గణేశ్

నాతవరం, జనవరి 3 : మండల కేంద్రం నాతవరంలో బుధవారం ప్రసాద్ ఉర్ల దర్శకత్వంలో ప్రొడక్షన్ నెం1 చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. నర్సీపట్నం ఎమ్మెల్యే గణేశ్ తొలుత హీరో గౌరినాయుడు, హీరోయిన్ యామిని బండారులపై క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. అనంతరం కల్యాణ మండపం సెట్ వేసి హీరో, హీరోయిన్‌లపై సన్నివేశాలను చిత్రీకరించారు. దర్శకుడు ప్రసాద్ ఉర్ల మాట్లాడుతూ పది రోజుల పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో షూటింగ్ జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

7న జనసేన ఆధ్వర్యంలో రైతు గర్జన సభ

చోడవరం, జనవరి 3 : రైతు సమస్యలపై జనసేన ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీ ఆదివారం బుచ్చెయ్యపేట మండలం గున్నెంపూడిలో రైతు గర్జన సభ నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సందర్భంగా చర్చించడంతో పాటు, వైసీపీ పాలనలో రైతులకు జరుగుతున్న అన్యాయం, మోసాలను రైతులకు వివరించనున్నామన్నారు. రైతులంతా పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

'ఇండస్ట్రియల్ హబ్‌గా చోడవరం

బుచ్చెయ్యపేట, జనవరి 3 : ఇండస్ట్రియల్ హబ్‌గా చోడవరం అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంత యువతకు ఉపాధి కల్పించేందుకు చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు చేసిన కృషిని వివరించారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి రుణభారాన్ని తగ్గించామన్నారు. సంక్షేమ బాట కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైసీపీ మండల అధ్యక్షుడు జోగా కొండబాబు, నాయకుడు కోవెల జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి

కె.కోటపాడు, జనవరి 3 : ఓటు హక్కు వినియోగంపై చౌడువాడలో వృద్ధులకు బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటైంది. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి, ఆర్ఐ జానకి మాట్లాడుతూ ఓటు ఓ వజ్రాయుధం వంటిదన్నారు. ఓటు సమర్థులకు వేస్తే దేశ భవిష్యత్తుతో పాటు ప్రజల భవిష్యత్తు బాగుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామునాయుడు, డి.సౌందర్య సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దిబ్బపాలెంలో భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర


శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

చీడికాడ, జనవరి 3 : దిబ్బపాలెంలో శోభాయాత్రను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను తలపై పెట్టుకుని పెద్ద సంఖ్యలో మహిళలు గ్రామ పురవీధుల్లో ఊరేగింపు జరిపి, ఇంటింటికీ పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా అంతా ఈ వేడుకలో భాగస్వాములయ్యారు.

నారా భువనేశ్వరిని కలిసిన టీడీపీ నాయకులు


భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న తాతయ్యబాబు

చోడవరం, జనవరి 3 : టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో మనస్తాపంతో ప్రాణాలు విడిచిన వారిని పరామర్శించేందుకు ఉత్తరాంధ్ర పర్యటన నిమిత్తం బుధవారం వచ్చిన నారా భువనేశ్వరిని పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు విశాఖలో కలిసి స్వాగతం పలికారు. 'నిజం గెలవాలి' కార్యక్రమం విజయవంతం కావాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పొట్టిదొరపాలెంలో శారదాదేవి జయంతి

బుచ్చెయ్యపేట, జనవరి 3: అతిథిదేవోభవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రామ కృష్ణపరమహంస సతీమణి శారదాదేవి జయంతిని బుధవారం పొట్టిదొరపాలెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త సాయం కొండబాబు, సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు, హెచ్ఎం ఎం.వి.రాఘవులు, ఎస్.కె.వహిదాబేగం, ఎన్.లక్ష్మణరావు, పి.సత్యబాబు, కె.రత్నం, బి.రమణమ్మ పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ,ఎంఈవో

నర్సీపట్నం, డిసెంబరు 3 : గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులలో ప్రతిభను గుర్తించి ఐఐటీ-జేఈఈ, నీట్ స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు రిషి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, ఎంఈవో తలుపులు బుధవారం అభినందించారు. గబ్బాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినవారికి నగదు బహుమతులు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ కె.సతీష్, హెచ్ఎం కిట్టు మాస్టారు, గాడి సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

3బిపిటి-4) దిబ్బిడి హైస్కూల్‌లో సావిత్రి బాయి పూలెకి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు.

ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి

బుచ్చెయ్యపేట, జనవరి 3 : మహిళల అభ్యున్నతికి సావిత్రి బాయి పూలే చేసిన సేవలు ఆదర్శనీయమని దిబ్బిడి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె.సత్యారావు అన్నారు. బుధవారం ఆమె జయంతి సందర్భంగా పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను కీర్తించారు.

నాతవరం : ఇక్కడి హైస్కూల్‌లో సావిత్రి బాయి పూలే జయంతిని నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మురళి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు ఎల్.విక్రమ్, నర్సీపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు పోలుపర్తి శ్రీనివాసరావు, నాతవరం మండలం నాయకులు అప్పారావు, హెచ్ఎం గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం

... 5వ పేజీ తరువాయి

ప్రతిభా భారతి, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, కిడారి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యే పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నియోజకవర్గ ఇన్‌చార్జులుగా ఉన్న గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, గిడ్డి ఈశ్వరి, కోరాడ రాజబాబు, పార్టీ నేతలు పాశర్ల ప్రసాద్, పట్టాభి స్వాగతం పలికారు.

అరకు కాఫీకి అరుదైన గుర్తింపు

- 'వన్ డిస్ట్రిక్ట్...వన్ ప్రొడక్ట్' పేరిట కేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో పతకం

పాడేరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో వివిధ జిల్లాల్లో ప్రాచుర్యం పొందిన ఉత్పత్తులకు 'వన్ డిస్ట్రిక్ట్..వన్ ప్రొడక్ట్' పేరిట ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా బుధవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అరకు కాఫీకి బంగారు పతకం లభించింది. జిల్లాల్లో ఓ ప్రత్యేకత కలిగిన ఉత్పత్తులకు జనంలో మంచి గుర్తింపు ఉంటున్నది. దీంతో ఆయా ఉత్ప త్తులను ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వివిధ రాష్ట్రాల్లో వున్న ప్రత్యేక ఉత్పత్తుల వివరాలను గత ఏడాది సెప్టెంబరులో సేకరించింది. అక్టోబరు నెలలో ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యేక ఉత్పత్తుల పరిశీలన జరిపింది. ఆ విధంగా గత ఏడాది అక్టోబరు 14న కేంద్ర బృందం సభ్యులు పాడేరు, అరకులోయ ప్రాంతాల్లో పర్యటించి ఇక్కడ కాఫీ సాగు, తదితర వివరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావులను అడిగి తెలుసుకున్నారు. కాగా బుధవారం ఢిల్లీలో నిర్వహించిన 'వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్' ఎంపిక ప్రక్రియకు దేశవ్యాప్తంగా 64 ఉత్పత్తులు రాగా, వాటిలో 14 ఉత్పత్తులకు గుర్తింపు లభించింది. వాటిలో అరకు కాఫీ ఒకటి కావడం విశేషం. మన్యం కాఫీకి బంగారు పతకం లభించింది. ఈ కార్యక్రమానికి జీసీసీ ఎండీ జి.సురేశ్‌కుమార్ హాజరై కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్‌గోయల్ నుంచి 'వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్' గుర్తింపు అవార్డును స్వీకరించారు. అరకు కాఫీకి కేంద్ర గుర్తింపు లభించడంపై కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, కాఫీ విభాగం అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే మన్యంలో కాఫీ మొక్కల పెంపకంలో, కాఫీ గింజల మార్కెటింగ్‌లో సేవలందించని జీసీసీ ఎండీని ఈ అవార్డు స్వీకరణకు పంపడంపైవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వాలు సహకారం అందించాలి

- బైరా ఫౌండేషన్ చైర్మన్ దిలీప్ చక్రవర్తి

మాడుగుల రూరల్, జనవరి 3 : వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు తగిన సహకారం అందించాలని బైరా ఫౌండేషన్ చైర్మన్ బైరా దిలీప్ చక్రవర్తి కోరారు. మండలంలోని జమ్మాదేవిపేటలో నూతనంగా ఏర్పాటైన గోసమాంబ వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ సంఘాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. రైతు బాగుంటేనే దేశం శుభిక్షంగా ఉంటుందన్నారు. మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఒకప్పుడు రాజులా ఉండే రైతు.. నేడు రోజువారి కూలీగా మారుతున్న దుస్థితిలో రావడం విచారకరమన్నారు. పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు మోసపోతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాపడ్డారు. సంఘం సీఈవో వడ్డి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కారయక్రమంలో ఆర్క్ సంస్థ ప్రతినిధి ప్రసాద్, బ్రహ్మానాయుడు, బషీర్, పుప్పాల రమేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.